క్లుప్తంగా

పుస్తకపఠనం అలవర్చుకోండి



పాఠశాలకు స్పోర్ట్స్ కిట్ అందజేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రంథాలయ అధికారి బాబుప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్డీటీ పాఠశాలలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. పద్యాలు, కథలు, చిత్రలేఖనం, ఖోఖో, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం గ్రంథాలయ సంస్థ తరఫున ఆర్డీటీ పాఠశాలకు క్యారమ్ బోర్డు, చెస్ బోర్డు, టెన్నిస్ రాకెట్స్, రింగ్స్ అందజేశారు.

మారెమ్మ కొండలో చిరుతల సంచారం

కుందుర్పి: మండలంలోని కలిగొలిమి, బెస్తరపల్లి, కెంచంపల్లి పరిసర ప్రాంతాల్లో చిరుతలు సంచరిస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. చీకటి పడితే గ్రామాల పరిసర ప్రాంతాల్లో చిరుతలు సంచరిస్తూ పెంపుడు కుక్కలు, ఆరుబయట ఉన్న మూగజీవాలను చంపేస్తున్నట్లు బాధిత రైతులు ఓబుళేసు, నాగప్ప, రామన్న, హనుమంత రాయుడు తదితరులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలిగొలిమి సమీపంలోని మారెమ్మ కొండలో రెండు చిరుతలు కనిపించినట్లు పశువుల కాపర్లు కామన్న, ఓబుళపతి, పెద్దన్న తదితరులు తెలిపారు. ఏడాది కాలంలో ఆయా గ్రామాల్లో 4 పశువులు, 8 మేకలు, గొర్రెలను చిరుతలు చంపినట్లు చెబుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి పరిసర ప్రాంతాల్లో ఉన్న చిరుతలను అటవీ ప్రాంతానికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా కోదండ రాముడి విగ్రహ ప్రతిష్ట



అలంకరణలో విగ్రహాలు

బ్రహ్మసముద్రం: మండల పరిధిలోని ముద్దలాపురంలో టీటీడీ, శ్రీవాణి ట్రస్ట్ సహకారంతో నిర్మించబడిన కోదండ రామాలయంలో సీతారామ లక్ష్మణ విగ్రహాలను శుక్రవారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

డాక్టర్‌కు తప్పిన ప్రాణాపాయం



కారు ముందు భాగం దెబ్బతిన్న దృశ్యం

కూడేరు: ఉరవకొండలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తు ఇటీవల పీజీ సీట్ రావడంతో అనంతపురంలోని మెడికల్ కాలేజీకి వెళ్లిన డాక్టర్ ఎర్రిస్వామి రెడ్డికి శుక్రవారం ప్రాణాపాయం తప్పింది. వివరాలు ఇలా.. ఎర్రిస్వామి రెడ్డి అనంతపురం నుంచి ఉరవకొండకు కారులో బయలుదేరాడు. కూడేరు మండల పరిధిలోని ముద్దలాపురం సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ వద్దకు రాగానే కారు అదుపు తప్పి ఎడమ నుంచి కుడి వైపుకు దూసుకెళ్లి పెట్రోల్ బంక్‌కు ఏర్పాటు చేసిన దిమ్మెను ఢీకొంది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. డాక్టర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

చిరుధాన్యాల సాగుతో లాభాలు



మాట్లాడుతున్న ఏడీఏ యల్లప్ప

కళ్యాణదుర్గం రూరల్: రైతులు వేరుశనగతో పాటు అంతర పంటగా చిరుధాన్యాలను వేసుకోవాలని ఏడీఏ యల్లప్ప సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ పాలక మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో రైతులకు అందుబాటులో విత్తన వేరుశనగను సిద్ధంగా ఉంచామన్నారు. విత్తన వేరుశనగ కావాల్సిన రైతులు ఆయా ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రైతులకు సంబంధించిన వివిధ రకాల స్ప్రేయింగ్‌కు డ్రోన్‌లు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ జగదీష్, అగ్రి అడ్వైజరీ బోర్డు సభ్యుడు కృష్ణ మూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు భేష్

- సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదిస్తాం
- గడప గడపకూ మన ప్రభుత్వంలో సంతోషం వ్యక్తం చేసిన లబ్ధిదారులు
- ఇంటింటికీ వెళ్లి బ్రోచర్లు అందజేసిన ప్రభుత్వ విప్ కాపు, మాజీ ఎమ్మెల్యే విశ్వ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



గుమ్మఘట్ట: పూలకుంటలో పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



ఉరవకొండ: పట్టణంలోని 11వ వార్డులో పథకాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

గుమ్మఘట్ట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు బాగున్నాయని పలువురు లబ్ధిదారులు ప్రశంసించారు. మండలంలోని పూలకుంట గ్రామంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఇంటింటికీ వెళ్లి బ్రోచర్లను లబ్ధిదారులకు అందించారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రతి కుటుంబం లబ్ధి పొందింది. ప్రభుత్వం మాకు అండగా నిలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో జగనన్నను తప్పకుండా ఆశీర్వదిస్తామని లబ్ధిదారులు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి తెలిపారు. పేదలకు కొండంత భరోసా ఇస్తున్న నాయకుడిని ఎట్టి పరిస్థితుల్లో వదులుకునేది లేదన్నారు. ఎన్నికల సమయాల్లో హడావుడిగా వచ్చి మీకు అది చేస్తాం.. ఇది చేస్తామని గట్టిగా చెప్పి అధికారంలో వచ్చాక తప్పించుకుపోయిన నాయకులను అనేక మందిని చూశాం. ఈ ప్రభుత్వంలో అలా కాకుండా అధికారంలో వచ్చాక గడప గడపకూ వచ్చి మీ కుటుంబానికి ఇంత లబ్ధి చేకూరింది. మా ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని కోరుకుంటున్న నాయకుడిని మిమ్మల్నే చూస్తున్నామంటూ సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు అందిస్తున్నారని తెలిపారు. నయాపైసా లంచం లేకుండా అత్యంత పారదర్శకంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులే స్వయంగా చెప్పడంతో ప్రభుత్వ విప్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రభుత్వం నుంచి ఇంకా ఏమైనా ఆశిస్తున్నారా? ఇంకా ఎలాంటి పథకాలు ప్రవేశపెడితే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ప్రభుత్వ విప్ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. టీడీపీని నమ్మితే నష్టపోతారని లబ్ధిదారులకు సూచించారు. పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు ప్రజలను మోసం చేయడంలో అతనికి అతనే సాటి అని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పులపాలయ్యిందని విమర్శించారు. టీడీపీ నాయకులు అక్రమార్జనపై దృష్టి పెట్టారన్నారు. ప్రజాసేవ చేయడం విస్మరించారని తెలిపారు. ప్రజాధనాన్ని పందికొక్కుల్లా టీడీపీ నాయకులు దోచుకున్నారని విరుచుపడ్డారు. నీరు–చెట్టు పేరు చెప్పి రూ. కోట్లు అక్రమంగా దోచుకున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధమ్మ, ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓఆర్డీ సురేశ్‌బాబు, మండల కన్వీనర్ బోయ మంజునాథ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, కాంట్రాక్టర్లు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, ఆర్టీ కాంతారెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, సర్పంచ్ కోట్ల ఉమేష్, ఎంపీటీసీ గోవింద, నాయకులు హనుమన్న, రామప్ప, మాజీ సర్పంచులు ముసలరెడ్డి, చిత్రశేఖరప్ప, నారాయణరెడ్డి ,పల్లక్కి రెడ్డి, సూరయ్య, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీని ప్రజలు నమ్మరు..

ఉరవకొండ: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం నేరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉరవకొండ పట్టణంలోని 11వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్థానిక పార్కు ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డికి వార్డు సభ్యురాలు బాను, ఎంపీటీసీ ఈడిగ ప్రసాద్, తాజు, అన్వర్, జిలాన్, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ ఇంతియాజ్, రఫీక్, గృహసారథులు శంకర, సంజీవ, బాలాజీ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే.. గడప గడపకూ తిరిగి పథకాల బుక్‌లెట్లను అందజేశారు.

ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 11వ వార్డులో తాగునీటి సమస్య ఉందని ప్రజలు చెప్పడంతో రూ.50 వేల పంచాయతీ నిధులతో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను మాజీ ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రమ్మ, సర్పంచ్ లలితమ్మ, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, పీఏసీఎస్ చైర్మన్ వడ్ల షేక్షావలి, సచివాలయ కన్వీనర్ ఆసిఫ్, టౌన్ బ్యాంకు అధ్యక్షుడు సాధుకుళ్లాయి స్వామి, కో–ఆప్షన్ సభ్యులు సలీం, గట్టు ఎర్రిస్వామి, ఎంఎల్‌ఓ ఓబుళేసు, వన్నూర్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ‘గడప గడపకూ మన ప్రభుత్వం’

గుమ్మఘట్ట: గుమ్మఘట్ట, గొనిగుంట గ్రామాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరవుతారన్నారు.

విద్యుత్ సమస్యకు పరిష్కారం

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని పులకుర్తిలో 12 రోజుల క్రితం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభం విరిగి పడింది. బీసీ కాలనీలోని సుమారు 30 ఇళ్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు కొందరు సమస్యను విప్ కాపు రామచంద్రారెడ్డికి ఫోన్‌లో విన్నవించారు. సత్వరం విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి 30 ఇళ్లకు సరఫరా పునరుద్ధరించాలని ట్రాన్స్‌కో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం హుటాహుటిన గ్రామానికి చేరుకున్న అధికారులు గంటల వ్యవధిలోనే విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. సమస్యను పరిష్కరించిన ప్రభుత్వ విప్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా చౌడేశ్వరీ దేవి విగ్రహ ప్రతిష్ట

వజ్రకరూరు: మండల పరిధిలోని కమలపాడులో శుక్రవారం చౌడేశ్వరీ దేవి విగ్రహ ప్రతిష్ట కనులపండువగా సాగింది. ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ, యంత్రపూజ, పూర్ణాహుతి తదితర పూజలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని చౌడేశ్వరీ దేవిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కురుబతిరకమ్మ, పండితుడు చంద్రమౌళి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విస్తృత స్థాయి సమావేశానికి సీనియర్ల డుమ్మా

- మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విముఖత

రాయదుర్గం: రాయదుర్గం టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ పరిశీలకులు ఫర్వీన్‌తాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి పార్టీ సీనియర్లు డుమ్మా కొట్టారు. గత టీడీపీ పాలనలో కీలక పదవులు అనుభవించిన వారిలో మెజార్టీ శాతం నాయకులు గైర్హాజరు కావడం తీవ్ర చర్చకు దారి తీసింది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గ నామినేటెడ్ పోస్టుల్లో కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలకు చెందిన నాయకులు కొందరు క్రియాశీలకంగా వ్యవహరించినా, ముఖ్య నాయకుడి వ్యవహార శైలి నచ్చక పార్టీ కార్యక్రమాల్లో అంటీ అంటనట్టుగా వ్యవహరిస్తున్నారు. బొమ్మనహాళ్ మండలంలో కొందరు సీనియర్లు పార్టీలో సరైన ప్రాధాన్యత లభించడం లేదనే అక్కసుతో టీడీపీకి బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకునే ఓ సామాజికవర్గం నాయకులు క్రమంగా దూరమయ్యారు. డి హీరేహాళ్‌లో ఒకే వ్యక్తిని అంటిపెట్టుకుని ఉండటంతో మిగిలిన కేడర్ తమకేమీ సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నారు. రాయదుర్గం, గుమ్మఘట్టతో పాటు అర్బన్‌లోనూ అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. పార్టీ కార్యక్రమాలు ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలని దిగువస్థాయి నాయకులు ఆందోళన చెందుతున్నారు. మహానాడు వేదికగా ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కొందరు విముకత వ్యక్తం చేస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

స్థానికులకే టిక్కెట్..?

బలమైన సామాజిక వర్గానికి చెందిన ఓ వ్యక్తి ఈ సారి టీడీపీ టిక్కెట్ ఆశిస్తుండడం, అతడికి తెరవెనుక సీనియర్ల మద్దతు మెండుగ ఉండడం లాంటి కారణాలు ఆ పార్టీలో జోరుగా చర్చలు మొదలయ్యాయి. ఎలాగైన సరే ఈ సారి అంతా ఏకమై స్థానికుల్లో ఒకరికి టిక్కెట్టు తెచ్చుకునేందుకు చేస్తున్న పోరాటం ఎంతవరకు ఫలిస్తోందో వేచి చూడాలి. తమ అభ్యర్థనను పక్కన పెడితే ఈ సారి తమ వాణి మరోలా ఉంటుందనే హెచ్చరికలు సైతం వారి అనుచరవర్గం నుంచి బహాటంగానే వెలువడుతుండటం విశేషం. ఇదిలా ఉండగా దిగువస్థాయి నుంచి శ్రమనే నమ్ముకుని అత్యున్నత స్థాయికి చేరి సేవా కార్యక్రమాలు చేపడుతున్న మరో బలమైన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఈసారి క్రియాశీలకంగా రాజకీయాల్లోకి అడుగుపెట్టేలా కృషి చేస్తున్నారని అతడి వర్గం నేతలు చెప్పుకుంటున్నారు. ఈ ఇద్దరి నేతల్లో ఎవరికో ఒకరికి టిక్కెట్ తెచ్చుకునేలా చిన బాబుతో నేరుగా పైరవీలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

కాలవను ఎంపీగా పంపుతారనే ప్రచారం

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులును ఈ సారి ఎన్నికల్లో ఎంపిగా పంపుతారనే ప్రచారం సర్వాత్రా వినిపిస్తోంది. అలాకాకపోయినా గుంతకల్లు లేదా మరో నియోజకవర్గంలో పోటీకి దింపవచ్చనే ఊహాగానాలు ఎక్కువయ్యాయి. స్థానికంగా కొందరు నేతలు పోటీకి లైన్ క్లియర్ చేసుకుంటున్నట్లు సమాచారం. వీరందరికీ భిన్నంగా మరో వ్యక్తి తనకే టిక్కెట్టు తెచ్చుకుంటానని మీరంతా సిద్ధంగా ఉండాలని తన కేడర్‌ను అప్రమత్తం చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మహానాడు మేనిఫెస్టో, వైఎస్సార్‌సీపీ వైఫల్యాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడం కొంత కష్టంగానే ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

రూ.60 లక్షలతో రోడ్డు నిర్మాణం



బేలోడులో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ కాపు

గుమ్మఘట్ట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని బేలోడు గ్రామం నుంచి 75 వీరాపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. రూ.60 లక్షల డీఎంఎఫ్ నిధులతో మెటల్ రోడ్డును నిర్మించి రెండు గ్రామాల ప్రజలకు కానుకగా అందిస్తామన్నారు. ప్రజల సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో స్వయంగా మాట్లాడి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. పనులను నాణ్యతగా చేపట్టి, సకాలంలో రోడ్డు పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్, పీఆర్ డీఈఈ రాంమోహన్‌రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట్ల ఉమేష్‌రెడ్డి, ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ బ్రహ్మయ్య, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఎంపీపీ భవాని, మండల కన్వీనర్ మంజునాథ, కాంట్రాక్టర్లు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, ఆర్‌టీ కాంతారెడ్డి, గోనబావి సర్పంచ్ రాజేష్, గోనబావి ప్రతాప్ రెడ్డి, హేమారెడ్డి, స్వామి, బేలోడు రామాంజినేయులు, ఖాసిం, సాల్మాన్ రాజు, బొమ్మన్న, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ సీఎం జగన్ సర్



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగులు

బొమ్మనహాళ్: ఒప్పంద పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న తమను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షనీయమని పారామెడికల్ ఉద్యోగులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ.. తమ బాధలను ఎవ్వరు పట్టించుకోలేదన్నారు. ఎన్నికల ముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేశారని తెలిపారు. పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగులంతా సీఎం జగనన్నకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎస్ శ్రీలత, వైద్య సిబ్బంది గోవర్ధన, జైనాభి, భాగ్యశ్రీ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ఏపీ కేబినెట్ నిర్ణయం తీసుకోవడంతో కాంట్రాక్టు ఉద్యోగులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి సమక్షంలో కాంట్రాక్టు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. థాంక్యూ సీఎం సార్ అంటూ కృతజ్ఞతలు తెలుపుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జగన్‌కు మద్దతుగా నిలబడుతామన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందాచంద్రమ్మ, సర్పంచ్ లలితమ్మ, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షులు బసవరాజు, సచివాలయ కన్వీనర్ ఆసీఫ్,వశికేరిమల్లి, ఓబన్న, వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగులు సూర్యకళ, ప్రసాద్‌రావు, మోతీలాల్, నూర్‌మహ్మద్, శ్రీనివాసులు, చంద్ర, రమేష్, రాఘవేంద్ర, నిమ్మల వెంకటేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏడీ రవికుమార్

కూడేరు: క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు జవాబుదారీగా పని చేయాలని వ్యవసాయశాఖ అనంతపురం డివిజన్ ఏడీ రవి కుమార్ మండల సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కూడేరు రైతు భరోసా కేంద్రంలో మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్‌పర్సన్ నిర్మలమ్మ అధ్యక్షతన మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన రైతులందరికీ పథకాల లబ్ధి అందేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. రైతులకు అందుబాటులో లేకుండా విధుల్లో నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వేరుశనగ పంటకు ప్రత్యామ్నాయంగా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులందించే జొన్న, రాగి, కొర్ర పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపేలా అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలో ఎక్కువగా ఆముదం పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని అగ్రి అడ్వైజరీ బోర్డు సభ్యులు తెలిపారు. సబ్సిడీతో రైతులకు ఆముదం విత్తనాలను అందజేయాలని కోరారు. 2021కి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పంటల బీమా ఇచ్చేలా చూడాలని విన్నవించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఏడీ హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో అందిస్తున్న విత్తన వేరుశనగను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణ రెడ్డి, ఆర్బీకే చైర్మన్లు, సభ్యులు, ఏఓ విజయకుమార్, ఏఈఓ శైలజ, వెటర్నరీ డాక్టర్ శ్వేత, ఎంపీఈఓలు, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

రేపు విగ్రహాల ప్రతిష్ట

శెట్టూరు: మండల కేంద్రంలోని చంద్ర మౌళీశ్వర దేవాలయంలో ఈనెల 11, 12 తేదీల్లో పార్వతి, నంది విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు మాజీ సర్పంచ్ బొమ్మజ్జి ఓ ప్రకటనలో తెలిపారు. రెండ్రోజుల పాటు పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. విగ్రహ ప్రతిష్ఠకు భక్తులు అధిక సంఖ్యలో రావాలని కోరారు.

దర్గాహొన్నూరులో వడగండ్ల వర్షం

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరులో గురువారం రాత్రి వడగండ్ల వర్షం కురిసింది. రైతు రామచంద్ర రెండున్నర ఎకరాల్లో సాగు చేసిన పత్తి పంట దెబ్బతింది. దాదాపు రూ.3.45 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

వీరశైవ సంఘం నాయకుడి మృతి



చంద్రమౌళి స్వామి (ఫైల్)

కళ్యాణదుర్గం: పట్టణానికి చెందిన తాలూకా వీరశైవ సంఘం నాయకుడు చంద్రమౌళి స్వామి (85) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈ సందర్భంగా వీర శైవ సంఘం తరఫున పలువురు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాలూకా వీరశైవ సంఘంలో సభ్యుడిగా ఉంటూ ఏటా శ్రీశైలం మల్లన్నకు 100 బస్తాల బియ్యం అందించేవారని కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం పేరూరుకు తరలించి అంత్యక్రియలు చేపట్టారు.

బ్రహ్మసముద్రం ఎంపీడీఓగా దాసా నాయక్



బ్రహ్మసముద్రం: ఎంపీడీఓగా ఎస్.దాసానాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకట్ నాయుడు నూతన ఎంపీడీఓకు బాధ్యతలు అప్పజెప్పారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీఓకు ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. మండలాభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీడీఓ దాసా నాయక్ తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని పేర్కొన్నారు.

అగ్రికల్చర్ ఫారం ఏడీఏగా నారాయణ నాయక్



కణేకల్లు: స్థానిక అగ్రికల్చర్ ఫారం ఏడీఏగా నారాయణ నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఏడీఏ రవి అనంతపురానికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో గుత్తిలో ఏడీఏగా పని చేస్తున్న నారాయణ నాయక్‌ను జిల్లా అధికారులు కణేకల్లు ఫారంకు బదిలీ చేశారు. కణేకల్లు అగ్రికల్చర్ ఫారంలో నాణ్యమైన వరి వంగడాలను ఉత్పత్తి చేసి రైతులకు అందించడానికి చర్యలు తీసుకుంటామని నారాయణనాయక్ తెలిపారు.

గర్భిణులకు భోజన వసతి

కూడేరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు సరిత, లక్ష్మీనారాయణ తదితరులు గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. సుఖ ప్రసవం జరగడానికి తీసుకోవాల్సిన జాగ్రతలు, ఆహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్‌ఐ సత్యనారాయణ గర్భిణులకు భోజన వసతి కల్పించారు.

రేపు ప్రవేశ పరీక్ష

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 11వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష ఉంటుందన్నారు. ఆరో తరగతిలో ప్రవేశానికి 151 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

అతిసారంతో పలువురికి అస్వస్థత

కణేకల్లు: కణేకల్లులోని మత్స్యకార్మికుల కాలనీలో ఫుడ్ పాయిజన్‌తో అతిసార వ్యాధి ప్రబలింది. మూడు ఇళ్లలో అతిసారా వ్యాధికి గురైన బాధితులు చికిత్స కోసం కణేకల్లు క్రాస్‌లోని ఆర్డీటీ ఆసుపత్రికి వెళ్లారు. 8 మందికి అతిసారా సోకినట్లు అధికారులు తెలిపారు. వాంతులు, విరేచనాలతో పలువురు ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న కణేకల్లు పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ శివశంకర్, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు హుటాహుటిన అక్కడికి చేరుకొని పారిశుధ్య పనులు చేపట్టారు. పలుచోట్ల బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. చిన్నారులను ఆడుకునేందుకు ఎండలో పంపొద్దని సూచించారు. అతిసార వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

కుందుర్పి: కుందుర్పి సబ్‌స్టేషన్ పరిధిలోని కుందుర్పి తదితర గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ జయకృష్ణ తెలిపారు. కుందుర్పి–కళ్యాణదుర్గం 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వజ్రకరూరు: మండలంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. 33కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం: బంధువుల మధ్య స్థల వివాదంలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శేఖర్, అతని చిన్నాన్న నాగేంద్రప్ప పక్కపక్కనే నివాసముంటున్నారు. ఇటీవల నాగేంద్రప్ప ఉంటున్న ఇంటిని అమ్మకానికి పెట్టాడు. అయితే ఇందుకు నిరాకరించిన శేఖర్ ఇద్దరికీ మధ్యలో గోడ ఉందని, ఎలా అమ్ముతావంటూ చిన్నాన్న నాగేంద్రప్పను నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి దాడికి దారి తీసింది. దాడిలో శేఖర్ గాయపడగా.. చికిత్స నిమిత్తం అతడ్ని కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బ్రహ్మసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోషకాహారం తీసుకోవాలి

వజ్రకరూరు: గర్భిణులు సరైన పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని వైద్యాధికారిణి తేజశ్వి సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్, రక్తహీనత, కాన్పులపై అవగాహన కల్పించారు. గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకుంటూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తయారు చేసే విధానం, తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ సుశీల, ఎంఎల్‌హెచ్‌పీలు భారతి, అమృత, సుధామాధురి, మణి, శ్రావణి, ఏఎన్‌ఎంలు సుకన్య, ఉషామౌనిక, భవ్య, అరుణజ్యోతి పాల్గొన్నారు.

పాలిసెట్ అభ్యర్థులకు అవగాహన సదస్సులు

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (బోరంపల్లి)లో పాలీసెట్ కౌన్సెలింగ్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వైఎస్ శ్రీధర్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈనెల 12 నుంచి 24వ తేదీ వరకూ నిర్వహించే అవగాహన సదస్సుల్లో సాంకేతిక విద్య, దాని ప్రాముఖ్యత, కళాశాలల ఎంపిక, వెబ్ ఆప్షన్లపై వివరిస్తామన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.